
సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శుక్రవారం । 13 । జూన్ । 2025



సోమశిలలో 39.05 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో గురువారం సాయంత్రానికి 39.055 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 4530 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,00,360
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.9,100
3 శాతం జీఎస్టీతో	రూ.9,373
సవర (8 గ్రా)	రూ.74,984

గరిష్టం/కనిష్టం
37.3 /28.9

వాతావరణం

జిల్లాలో శుక్రవారం అక్కడక్కడ మోస్తరు జల్లులు పడవచ్చని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ గురువారం 65 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

విమాన ప్రమాదంపై దిగ్భ్రాంతి



కోవూరు: అహ్మదాబాద్ నుంచి లండన్‌లోని గాట్విక్ విమానాశ్రయానికి వెళ్తున్న ఎయిర్ ఇండియా విమానం ప్రమాదానికి గురై.. అందులో ప్రయాణిస్తున్న వారు మృతి చెందిన ఘటనపై మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పీఏసీ సభ్యుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అహ్మదాబాద్‌లోని మెడికల్ కళాశాల మెస్‌పై కూలి మెడికోలూ మృతి చెందిన ఘటన తనను తీవ్ర ఆవేదనకు గురిచేసిందని చెప్పారు. మృతుల కుటుంబీకులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

హృదయ విదారకం



ఆత్మకూరు రూరల్: అహ్మదాబాద్‌లో చోటుచేసుకున్న విమాన ప్రమాదం హృదయ విదారకమని ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రయాణికులతో పాటు సిబ్బంది, కూలిన చోట 20 మంది వైద్య విద్యార్థులు ప్రాణాలు కోల్పోవడం ప్రతి ఒక్కరి మనస్సును కలిచి వేస్తోందని చెప్పారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి



నెల్లూరు (స్టోన్‌హౌస్ పేట): అహ్మదాబాద్‌లో విమానం కూలి ప్రయాణికులు మృతి చెందడం తనకు కలిచి వేసిందని ఎమ్మెల్సీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఘటనలో స్థానిక మెడికల్ కళాశాల విద్యార్థులు మరణించడం బాధాకరమన్నారు. మృతుల కుటుంబీకులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

'పది' సప్లిమెంటరీలోనూ అంతే..

- 13వ స్థానంలో జిల్లా
- 77.55 శాతం ఉత్తీర్ణత

నెల్లూరు (టౌన్): పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాల్లోనూ జిల్లా వెనుకంజలోనే నిలిచింది. 13వ స్థానాన్ని దక్కించుకొని.. 77.55 శాతం ఉత్తీర్ణతకే పరిమితమైంది. ఫలితాలను గురువారం విడుదల చేశారు. గత నెల 19 నుంచి 28 వరకు నిర్వహించిన ఈ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 4690 మంది హాజరు కాగా, 3637 మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో బాలురు 74.97.. బాలికలు 81.11 శాతం ఉత్తీర్ణత సాధించారు. జవాబు పత్రాల రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు ఈ నెల 19లోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది.

2.25 లక్షల ఎకరాలకు సాగునీరు



మాట్లాడుతున్న దేశ్‌నాయక్

సంగం: జిల్లా వ్యాప్తంగా 2.25 లక్షల ఎకరాలకు ఎడగారులో సాగునీటిని అందించనున్నామని ఇరిగేషన్ ఎస్‌ఈ దేశ్‌నాయక్ తెలిపారు. సంగం బ్యారేజీ వద్ద నీటిమట్టాన్ని గురువారం పరిశీలించిన అనంతరం అధికారులకు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. సాగునీరు వృథా కాకుండా తనిఖీలను చేపడుతున్నామని చెప్పారు. పెన్నాకు సోమశిల నుంచి పది టీఎంసీలను విడుదల చేశామని వివరించారు. అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి 2023కు సంబంధించిన జీతాలను చెల్లించనున్నామని తెలిపారు. డీఈ పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

సిటీ ప్లానర్ బాధ్యతల స్వీకరణ

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగంలో సిటీ ప్లానర్‌గా హిమబిందు బాధ్యతలను గురువారం స్వీకరించారు. ఏసీపీ వేణుతో పాటు సూపరింటెండెంట్ మునిరత్నం తదితరులు ఆమెకు పుష్పగుచ్ఛాన్ని అందజేసి అభినందనలను తెలియజేశారు.

అగచాట్ల ఆహ్వానం

- అధ్వాన టాయ్‌లెట్లు, తరగతి గదులతో బేజారు
- తొలి రోజు మొక్కుబడిగా క్లాసులు
- పలువురు ఉపాధ్యాయుల డుమ్మా
- విద్యాసంవత్సర ప్రారంభ రోజున ప్రభుత్వ స్కూళ్లలో ఇదీ తీరు
- 'తల్లికి వందనం'పై స్పష్టత ఇవ్వని ప్రభుత్వం
- సచివాలయాలు, స్కూళ్ల చుట్టూ ప్రదక్షిణలు



కేఎన్నార్ ఉన్నత పాఠశాలలో చెట్ల కింద పదో తరగతి విద్యార్థులు

విద్యార్థుల కేరింతలు.. చూడముచ్చటైన పాఠశాలలు.. పండగ వాతావరణం.. ఇదంతా గతం. నాటి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో సర్కారీ స్కూళ్ల రూపురేఖలు సమూలంగా మారిపోయాయి. నాడు – నేడుతో ఆయన చేపట్టిన చర్యలతో సరస్వతీ నిలయాలు కళకళలాడి.. అందులో చేరే విద్యార్థుల సంఖ్యా ఎక్కువగా ఉండేది. అమ్మఒడి పేరిట తల్లుల ఖాతాల్లో నగదును ఠంచనుగా జమచేసేవారు. విద్యాసంవత్సర ప్రారంభ రోజునే స్టూడెంట్స్‌కు అన్నీ సమకూరేవి. అయితే కూటమి ప్రభుత్వ పాలనలో అకడమిక్ ఇయర్ ప్రారంభ రోజున విద్యార్థులకు సమస్యలు స్వాగతం పలికాయి. అధ్వానంగా మారిన టాయ్‌లెట్లు.. తరగతి గదులను చూసి బేజారెత్తడం వారి వంతైంది.

నెల్లూరు (టౌన్): వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు గురువారం పునఃప్రారంభమయ్యాయి. ఎంతో ఉత్సాహంగా సర్కారీ స్కూళ్లకు హాజరైన విద్యార్థులకు అసౌకర్యాల నడుమ తరగతులను నిర్వహించారు. తక్కువ సంఖ్యలో విద్యార్థులు, ఉపాధ్యాయులు హాజరయ్యారు. మంచి రోజు చూసి తమ పిల్లలను పంపాలని తల్లిదండ్రులు భావించడంతో ప్రైవేట్ స్కూళ్లలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. మరోవైపు ఎస్జీటీల బదిలీలు జరుగుతుండటంతో వారి ధ్యాసంతా దానిపై కేంద్రీకృతం కావడంతో విధులకు మొక్కుబడిగా హాజరయ్యారు.

ఇవేమి సమస్యలు బాబోయ్..

- జిల్లాలోని అధిక పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లు మరమ్మతులకు గురయ్యాయి. ఈ పరిణామాల క్రమంలో విద్యార్థులు తమ ఇళ్ల నుంచి బాటిళ్లను తెచ్చుకున్నారు. ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో మంచి నీళ్లు చాలక నానా ఇబ్బంది పడ్డారు.
- టాయ్‌లెట్లు, తరగతి గదులు అపరిశుభ్రంగా దర్శనమిచ్చాయి. కనీసం వీటిని శుభ్రపర్చాలనే ఆలోచనే రాకపోవడం శోచనీయం.
- నాడు – నేడుపై కూటమి ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరితో పనులు అసంపూర్తిగా మారి, కొన్ని చోట్ల వరండాల్లో తరగతులను నిర్వహించిన పరిస్థితి ఉత్పన్నమైంది.
- ఉపాధ్యాయులకు సంబంధించిన ఫేజ్ రికగ్నిషన్ యాప్ సక్రమంగా పనిచేయలేదు.

విద్యార్థుల సంఖ్య ఆధారంగా..

జిల్లాలోని పాఠశాలలను ఐదు రకాలుగా విభజించారు. ఫౌండేషన్ స్కూళ్లగా 968.. బేసిక్ ప్రైమరీగా 1261.. మోడల్ ప్రైమరీగా 625.. అప్పర్ ప్రైమరీగా 79, హైస్కూళ్లగా 393ను విభజించారు. ఇక్కడ విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఉపాధ్యాయులను కేటాయించనున్నారు. మోడల్ ప్రైమరీ స్కూళ్లకు నలుగురు ఎస్జీటీలను కేటాయించనున్నామని జిల్లా విద్యాశాఖ అధికారులు చెప్తున్నారు.

స్టూడెంట్స్ కిట్లు.. అరకొరగా..

స్టూడెంట్స్ కిట్లను తొలి రోజు అరకొరగా అందజేశారు. పాఠ్య, నోట్ పుస్తకాలు, డిక్షనరీలను పంపిణీ చేసినా, బ్యాగులను అందరికీ ఇవ్వలేదు. బూట్లు, సాక్స్ జిల్లాకు ఇంకా రాకపోవడంతో పంపిణీకి నోచుకోలేదు. యూనిఫారాన్ని ఎప్పుడిస్తారో నేటికీ స్పష్టత లేదు. జిల్లాలోని అధిక పాఠశాలల్లో కార్యక్రమాన్ని మొక్కుబడిగా నిర్వహించారు.



ఇంటి నుంచి తెచ్చుకున్న భోజనమే దిక్కు..

నాణ్యత లేక.. ఇళ్ల నుంచే ఆహారం

జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని తూతూమంత్రంగా అమలు చేశారు. వెజిటబుల్ రైస్, బంగాళదుంప కూర, ఉడికించిన గుడ్డును అందజేశారు. జిల్లా వ్యాప్తంగా 52,899 మందికి గానూ 51,696 మందికి దీన్ని అందజేశామని విద్యాశాఖ అధికారులు లెక్కలు చెప్తున్నారు. అయితే చాలా చోట్ల భోజనం చేయకపోయినా, జరిగిందనే రీతిలో లెక్కలు చూపారని సమాచారం. మరోవైపు నాణ్యత, రుచి లేకపోవడంతో చాలా మంది తమ ఇళ్ల నుంచే క్యారేజీలను తెచ్చుకున్నారు.

మరో నాలుగైదు రోజుల్లో పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులు

"బదిలీలు ప్రస్తుతం జరుగుతున్న తరుణంలో పాఠశాలలకు ఉపాధ్యాయులు మరో నాలుగైదు రోజుల్లో పూర్తి స్థాయిలో హాజరవుతారు. ఇప్పటికే హెచ్ఎంలు, స్కూల్ అసిస్టెంట్ల బదిలీలను పూర్తి చేశాం. తొలి రోజు అన్ని పాఠశాలల్లో తరగతులను సజావుగా నిర్వహించాం. మధ్యాహ్న భోజనాన్నీ అందజేశాం. స్టూడెంట్స్ కిట్లను పంపిణీ చేశాం. – బాలాజీరావు, డీఈఓ

తల్లికి వందనంపై బంతాట



తల్లికి వందనంలో భాగంగా విద్యార్థుల తల్లి బ్యాంక్ ఖాతాల్లో నగదు జమయ్యాయనే ప్రచారంతో పాఠశాలలకు పరుగులు తీశారు. ఉపాధ్యాయులను ఆరాతీయగా, సచివాలయాల్లో అడగాలని సెలవిచ్చారు. అక్కడికెళ్లినా నిరాశే ఎదురైంది. తమకెలాంటి సమాచారం లేదని వారు చెప్పడంతో అటూ.. ఇటూ ప్రదక్షిణలు చేశారు. దీనిపై జీఓను రాష్ట్ర ప్రభుత్వం గురువారం సాయంత్రం జారీ చేసినా, అందులో దరఖాస్తు నమోదు అనే అంశంపై ఎక్కడా స్పష్టత ఇవ్వలేదు. మరోవైపు పథకంలో భాగంగా ప్రతి బిడ్డకూ రూ.15 వేలను అందజేస్తామని చెప్పినా, ప్రస్తుతం రూ.13 వేలనే ఇచ్చి, పాఠశాలల నిర్వహణకు మిగిలిన మొత్తాన్ని మినహాయిస్తారనే ప్రచారం జరుగుతోంది.

సచివాలయాల్లో జాబితా అంట..

అర్హులు, అనర్హుల జాబితా సచివాలయాల్లో ఉందని, అర్హులైతే సంబంధిత పత్రాలను అప్‌లోడ్ చేసుకోవాలని జీఓలో పొందుపర్చారు. జిల్లాలో ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు సుమారు నాలుగు లక్షలకుపైగా విద్యార్థులకు ఈ పథకం వర్తించనుంది. ఒకటో తరగతి, ఇంట్లో ఒకరికి మించి ఎక్కువ మంది పిల్లలుంటే వారు ఎప్పుడు దరఖాస్తు చేసుకోవాలనే అంశంపైనా సమాచారం లేదు.

పరిశ్రమల పేరిట.. పొలాలు లాక్కుంటారా..?



- ధ్వజమెత్తిన మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు

కందుకూరు: పరిశ్రమల పేరుతో పచ్చని పొలాలను లాక్కోవడం దారుణమని.. వీటిని కోల్పోతున్న రైతులకు నష్టపరిహార చెల్లింపులోను అన్యాయం జరుగుతోందని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు పేర్కొన్నారు. రామాయపట్నంలో గురువారం పర్యటించిన ఆయన భూములు కోల్పోతున్న రైతులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం 2013లో తీసుకొచ్చిన భూసేకరణ చట్టం మేరకు రైతుల నుంచి భూమిని సేకరించాలంటే సబ్ రిజిస్ట్రార్ నిర్ణయించిన ధర ప్రామాణికంగా పరిహారాన్ని నాలుగురెట్లను చెల్లించాలని చెప్పారు. గ్రామసభలను నిర్వహించి రైతులు, రైతు కూలీలు, ఇతర వర్గాల ప్రయోజనాలు దెబ్బతినకుండా భూసేకరణ జరపాల్సి ఉందని చెప్పారు. అయితే ఈ చట్టాన్ని సీఎం చంద్రబాబు సవరించి, పారిశ్రామికవేత్తలకు కారు చౌకగా కట్టబెడుతున్నారని ఆరోపించారు. అనంతరం ఆమ్‌ఆద్మీ పార్టీ నేత నేతి మహేశ్వరరావు మాట్లాడారు. భూసేకరణ చట్టాన్ని తుంగలో తొక్కారని, దీని వల్ల దేశానికే తలమానికంగా ఉన్న ఉలవపాడు పరిసర ప్రాంతాల మామిడితోటలు కనుమరుగయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సోలార్ ప్రాజెక్టు కోసం భూములను ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేస్తున్నారని ఆరోపించారు. అన్ని గ్రామాల రైతులు జేఏసీగా ఏర్పడి తమ అభిప్రాయాలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని, కొద్ది మంది రాజకీయ నేతల మాటలు నమ్మి భూములను కోల్పోవద్దని సూచించారు.

చెప్పేదొకటి.. చేసేదొకటి

నాడు అమరావతిలో ఏకపక్షంగా భూములను సేకరిస్తుంటే అనేక పోరాటాలు చేయాల్సి వచ్చిందని, ఆపై విస్తృత స్థాయిలో చర్చించి సీఆర్డీఏ చట్టాన్ని తీసుకొచ్చారని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ అధ్యక్షుడు కొరివి వినయ్‌కుమార్ పేర్కొన్నారు. రామాయపట్నంలో అమాయక ప్రజల ఉపాధిని దెబ్బతీసేలా భూసేకరణ జరుగుతోందని ఆరోపించారు. పచ్చని చెట్లు పెంచండి అంటూ ఉపన్యాసాలిస్తూ.. మరోవైపు ప్రసిద్ధి గాంచిన మామిడితోటలను సీఎం నరికేయిస్తున్నారని విమర్శించారు. సీపీఐ మహిళా నేత అరుణ, రైతు నేతలు చుండూరి రంగారావు, సామాజిక ఉద్యమకారుడు వెంకటేశ్వర్లు, సీపీఐ నేతలు వీరారెడ్డి, పాలేటి కోటేశ్వరరావు, సురేష్ పాల్గొన్నారు.

చంద్రబాబు పాలనపై ప్రజల చీదరింపు

- వైఎస్సార్‌సీపీ యువజన విభాగ జిల్లా అధ్యక్షుడు నాగార్జున



మాట్లాడుతున్న నాగార్జున, పక్కన ఆశ్రిత్‌రెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): కూటమి ప్రభుత్వం కొలువుదీరి ఏడాదైనా.. హామీల అమల్లో విఫలమైన సీఎం చంద్రబాబును ప్రజలు చీదరించుకుంటున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగ జిల్లా అధ్యక్షుడు ఊటుకూరు నాగార్జున పేర్కొన్నారు. రామ్‌జీనగర్‌లోని పార్టీ నగర నియోజకవర్గ కార్యాలయంలో పార్టీ విద్యార్థి విభాగ జిల్లా అధ్యక్షుడు ఆశ్రిత్ రెడ్డితో కలిసి విలేకరులతో గురువారం ఆయన మాట్లాడారు. ఓటేసి గెలిపించిన ప్రజలను టీడీపీ మోసం చేసిందని మండిపడ్డారు. ఏడాదికి నాలుగు లక్షల ఉద్యోగాలను కల్పిస్తామని ఇచ్చిన హామీ నీటమూటగా మిగిలిందని విమర్శించారు. నిరుద్యోగ భృతి ఊసెత్తడంలేదని ఆరోపించారు. వలంటీర్లు, ఎండీయూ వాహనాల సిబ్బందిని తొలగించి వారిని రోడ్డున పడేశారని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన నాటి నుంచి మహిళలపై అఘాయిత్యాలు నానాటికీ ఎక్కువయ్యాయని చెప్పారు. మహిళల భద్రతపై ఎన్నికలకు ముందు ఉపన్యాసాలిచ్చిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు ప్రస్తుతం ఇవేవీ కనిపించడంలేదానని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వ బూటకపు హామీలు, అకృత్యాలను ప్రశ్నించే తమ పార్టీ శ్రేణులపై కేసులు పెట్టి కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు.

నిరసన ర్యాలీ నేడు

కూటమి ఏడాది దుర్మార్గపు పాలనకు వ్యతిరేకంగా నిరసన ర్యాలీని శుక్రవారం చేపట్టనున్నామని వెల్లడించారు. బారకాసు సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీని ఉదయం తొమ్మిది గంటలకు నిర్వహించి, కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేయనున్నామని చెప్పారు. యువత, విద్యార్థులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆశ్రిత్‌రెడ్డి మాట్లాడారు. యువగళంలో ఇచ్చిన హామీలను లోకేశ్ విస్మరించి, యువతను నిలువునా మోసం చేశారని మండిపడ్డారు. ఫీజులను చెల్లించలేక.. తమ సర్టిఫికెట్లను కళాశాల నుంచి తెచ్చుకోలేక విద్యార్థులకు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

చిన్న కాంట్రాక్టర్లపై కక్షెందుకు..?

- బిల్లులు రాక తీవ్రంగా నష్టపోతున్నారు
- పెద్ద వారికేమో సకాలంలో రూ.కోట్లల్లో చెల్లింపు
- ప్రొటోకాల్ పాటించని ఏఈపై చర్యలేవీ..?
- జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ



మాట్లాడుతున్న ఆనం అరుణమ్మ

నెల్లూరు (పొగతోట): పెద్ద కాంట్రాక్టర్లకు రూ.కోట్లల్లో బిల్లులను సకాలంలో ఇస్తున్నా, చిన్న కాంట్రాక్టర్లకు రూ.లక్ష బిల్లులను చెల్లించేందుకు తీవ్ర జాప్యం జరుగుతోందని, ఫలితంగా వారు నష్టపోతున్నారని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ పేర్కొన్నారు. నెల్లూరులోని జెడ్పీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాల్లో ఆమె మాట్లాడారు. త్వరితగతిన చెల్లించేలా చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ రాజ్ ఇతర శాఖల అధికారులను ఆదేశించారు. జిల్లా ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. జలజీవన్ మిషన్‌కు సంబంధించిన పనులను వేగవంతం చేయాలని సూచించారు.

వినతులు స్వీకరిస్తున్నా, పరిష్కారమేదీ..?

సమస్యల పరిష్కారానికి అధికారులు వినతులను స్వీకరిస్తున్నా, పరిష్కారం చూపడంలేదన్నారు. జెడ్పీటీసీలు సమర్పించిన వినతులకే దిక్కులేకపోతే సామాన్యుల పరిస్థితేమిటని ప్రశ్నించారు. ఎంపీ నిధులను ఏడాది క్రితం మంజూరు చేయించినా, పనులను నేటికీ ప్రారంభించలేదని అసహనం వ్యక్తం చేవారు. నెల్లూరు రూరల్ మండలం సౌత్‌మోపూరులో పాఠశాల అభివృద్ధికి జెడ్పీ ద్వారా నిధులను కేటాయించామని, శంకుస్థాపన సమయంలో ప్రొటోకాల్‌ను పాటించలేదని చెప్పారు. దీనికి సంబంధించి పీఆర్ ఏఈపై చర్యలు చేపట్టాలని కలెక్టర్‌కు మూడు నెలల క్రితం విన్నవించినా, నేటికీ ఎలాంటి సంజాయిషీ లేదన్నారు.

చర్యలకు డిమాండ్

ఆత్మకూరులో బ్రిటిష్ కాలం నాటి భవనాన్ని నేలకూల్చి రంగూన్ టేకును మాయం చేశారని, మంత్రికి సమాచారమివ్వకుండానే ఎలా కూలుస్తారని.. దీనికి అనుమతులను ఎవరిచ్చారని ప్రశ్నించారు. కలప సగానికిపైగా మాయమైందని, పూర్తిస్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

కూలీలకు పనులు కల్పించాలి

ఉపాధి పనులకు సంబంధించిన పేమెంట్లను సకాలంలో చెల్లించి కూలీలకు వర్కులను కల్పించాలని సూచించారు. నూతన గృహాలను ప్రస్తుతం మంజూరు చేయడంలేదని, దరఖాస్తు చేసుకునేందుకు సచివాలయాలకు వెళ్తే లాగిన్లు పనిచేయడంలేదన్నారు. సమావేశాలకు అధికారులు సమయపాలన పాటించడంలేదని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా జాబ్ మేళాలను నిర్వహించి నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలను కల్పించాలని కోరారు.

దయనీయంగా రైతుల పరిస్థితి

గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పాలనలో పుట్టి ధాన్యం రూ.28 వేల నుంచి రూ.30 వేల వరకు విక్రయించడంతో రైతులు సుభిక్షంగా ఉన్నారని, అయితే ప్రస్తుతం వారి పరిస్థితి దయనీయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత సీజన్లో పంటల సాగుకు రైతులు పూర్తిస్థాయిలో ముందుకు రావడం లేదని వ్యవసాయాధికారులు నివేదికలివ్వడంపై చైర్‌పర్సన్ అసహనం వ్యక్తం చేశారు. కరోనా విషయంలో ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. ప్రైవేట్ హాస్పిటళ్లకు వెళ్లి ఖర్చు చేసుకోకుండా.. ప్రభుత్వ వైద్యశాలల్లో సేవలు పొందాలని కోరారు. నిధులను మంజూరు చేసినా అంగన్‌వాడీ భవనాలను నిర్మించలేదని, జిల్లాలో ఇలా అద్దె భవనాల్లో ఎన్ని కేంద్రాలను నిర్వహిస్తున్నారు.. ఎంత ఖర్చు చేస్తున్నారు.. సొంత బిల్డింగులను నిర్మించుకోరాదని ఐసీడీఎస్ అధికారులను ప్రశ్నించారు. గ్రామాల్లో జెడ్పీటీసీలు పర్యటించి, సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని తెలిపారు. బీసీ కార్పొరేషన్, ఇతర సంక్షేమ శాఖల ద్వారా అవసరమైన వారికే పథకాలను మంజూరు చేయించుకుంటూ, అర్హులకు అన్యాయం చేస్తున్నారని పేర్కొన్నారు. జెడ్పీ సీఈఓ మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఎడ్ల బండలాగుడు పోటీలు



బండలాగుతున్న బద్వేలు ఎడ్లు

ఉదయగిరి: మండలంలోని గన్నేపల్లి పంచాయతీలో అడవి పేరంటాలమ్మ తల్లి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎడ్ల బండలాగుడు పోటీలను చివరి రోజు గురువారం నిర్వహించారు. ఇందులో కడప జిల్లాకు చెందిన ఎడ్లు సత్తా చాటాయి. బద్వేలు మండలం కుమ్మరికుంటకు చెందిన వినుకొండ రసూల్ ఎడ్లు నిర్దేశించిన సమయంలో 1862 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానంలో.. అదే జిల్లా రొక్కువారిపల్లెకు చెందిన ఓబుల్‌రెడ్డి ఎడ్లు 1515.5 అడుగులు లాగి ద్వితీయ స్థానంలో నిలిచాయి. వీరికి వరుసగా రూ.35 వేలు, రూ.25 వేల నగదు బహుమతిని ఆలయ కమిటీ అందజేసింది. బందోబస్తును ఎస్సైలు ఇంద్రసేనారెడ్డి, శ్రీనివాసులు ఏర్పాటు చేశారు.

సారీ తప్పయింది..

- అసభ్య ప్రవర్తనలో వైద్యుడికి క్లీన్‌చిట్
- తామే పొరపడ్డామని అంగీకరించిన బాలిక తల్లిదండ్రులు, బంధువులు



వైద్యుడు ప్రశాంత్‌తో కలిసి మాట్లాడుతున్న బాలిక తల్లిదండ్రులు, బంధువులు

ఉదయగిరి: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో 12 ఏళ్ల బాలికతో విధి నిర్వహణలో ఉన్న డాక్టర్ ప్రశాంత్ అసభ్యకరంగా ప్రవర్తించారనే ఘటన అనూహ్య మలుపు తిరిగింది. ఈ ఉదంతంలో వైద్యుడిపై దౌర్జన్యం చేసి పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేసిన విషయం విదితమే. తాజాగా దీనికి సంబంధించి స్థానిక సీహెచ్‌సీలో బాలిక తల్లిదండ్రులు, బంధువులు, వైద్యుడితో కలిసి విలేకరుల సమావేశాన్ని గురువారం రాత్రి నిర్వహించారు. సీసీ కెమెరాలోని దృశ్యాలను పరిశీలించగా, బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించలేదనే విషయం స్పష్టమవడంతో వైద్యుడికి క్షమాపణలను తెలియజేశారు. బాలిక చెప్పిన మాటలకు పొరబడి తాము దురుసుగా ప్రవర్తించామని, దీన్ని మనస్సులో పెట్టుకోకుండా విధులకు హాజరుకావాలని కోరారు. ఘటన సమయంలో కొంతమంది వ్యక్తులు జోక్యం చేసుకొని దురుసుగా ప్రవర్తించారని వారు తెలిపారు.

విచారణకు కమిటీ

ఈ విషయమై పూర్తిస్థాయిలో విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చేందుకు గానూ ఓ కమిటీని జిల్లా వైద్యాధికారి ఏర్పాటు చేశారు. రెండ్రోజుల్లో విచారణ జరిపి నివేదికను సమర్పించనున్నారు. కాగా ఈ ఉదంతంపై ఎస్సై ఇంద్రసేనా రెడ్డిని సంప్రదించగా, విచారణ కొనసాగుతోందని బదులిచ్చారు.

కాపాడిన సీసీ కెమెరా ఫుటేజీ

ఈ వ్యవహారం నుంచి వైద్యుడు బయటపడేందుకు సీసీ కెమెరాల్లో నిక్షిప్తమైన దృశ్యాలు దోహదపడ్డాయి. రోజువారీకి భిన్నంగా సీసీ కెమెరా అమర్చిన సమీప ప్రాంతంలో రోగులకు వైద్యం చేయడంతో ఏమీ జరగలేదనే విషయం స్పష్టమైంది. ఆయనపై కొందరు పన్నిన కుట్ర భగ్నమైందని వైద్యశాలలోని పలువురు డాక్టర్లు, సిబ్బంది మాట్లాడుకున్నారు. అసలే మారుమూల ప్రాంతం కావడంతో ఇక్కడ పనిచేసేందుకు వైద్య సిబ్బంది పెద్దగా ఆసక్తి చూపరు. గ్రూపు తగాదాల నేపథ్యంలో.. వచ్చిన వారిని ఏదో ఒక వివాదంలో ఇరికించి ఇక్కడ పనిచేయకుండా కొందరు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న అంశంపై జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. ఘటనతో ప్రమేయమున్న సిబ్బందిని వేరే ప్రాంతానికి బదిలీ చేయాలని కోరుతున్నారు.

పిల్లల్ని పాఠశాలలకు పంపాలి



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఆర్వో

నెల్లూరు(పొగతోట): బడి ఈడు పిల్లలను తప్పనిసరిగా స్కూళ్లకు పంపి చదివించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని డీఆర్వో ఉదయ్‌భాస్కర్ అన్నారు. గురువారం ప్రపంచ బాల కార్మికుల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నెల్లూరులోని గాంధీబొమ్మ సెంటర్ నుంచి వీఆర్సీ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. దీనిని డీఆర్వో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలల చేత పని చేయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్మిక శాఖ ఉప కమిషనర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పాఠశాలలు పునఃప్రారంభమైన నేపథ్యంలో పిల్లలను తప్పనిసరిగా పంపాలన్నారు. కార్యక్రమంలో కార్మిక శాఖ ఏడీ గౌస్‌బాషా, ఐసీడీఎస్ పీడీ అనూరాధ, సీడీపీఓ అరుణ, బాలల సంరక్షణాధికారి సురేష్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

కారు అద్దాలు పగులగొట్టి..

- రూ.8.90 లక్షల చోరీ



నగదు ఎత్తుకెళ్లింది ఈ కారు నుంచే..

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆస్తి రిజిస్ట్రేషన్ చేయించుకోవడానికి వచ్చిన అనుమసముద్రంపేట గ్రామానికి చెందిన చిలకపాటి శ్రీనివాసులు అనే వ్యక్తి కారు అద్దాలను గుర్తుతెలియని వ్యక్తులు పగులగొట్టి రూ.8.90 లక్షల నగదును అపహరించారు. ఈ ఘటన గురువారం చోటు చేసుకుంది. ఆత్మకూరు ఎస్సై జిలానీ కథనం మేరకు.. రిజిస్ట్రేషన్ నిమిత్తం వచ్చిన బాధితులు కారులో నగదు ఉంచి తాళాలు వేసి కార్యాలయంలోకి వెళ్లాడు. తిరిగి వచ్చేలోపు కారు అద్దాలు పగులగొట్టి బ్యాగ్‌లోని నగదును అపహరించారని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. బాధితులకు న్యాయం చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు.

అప్పుల బాధ తాళలేక..

- యువకుడి ఆత్మహత్య



మనోహర్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీస్

ఇందుకూరుపేట: అప్పుల బాధ తాళలేక ఓ యువకుడు పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని కొరుటూరులో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. కొరుటూరుపాళేనికి చెందిన ముత్యాల మనోహర్ (29)కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. అతను వివిధ కారణాలతో అప్పులపాలయ్యాడు. దీంతో మనస్తాపానికి గురై బుధవారం సముద్రం ఒడ్డున పురుగు మందు తాగాడు. కొంతసేపటికి భయపడిన మనోహర్ తాను ఆత్మహత్యకు యత్నించానని నోటి నుంచి నురగలు కక్కుకొంటూ అటుగా వెళ్తున్న స్థానికులకు చెప్పాడు. దీంతో వారు చికిత్స నిమిత్తం ద్విచక్ర వాహనంపై ఇందుకూరుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమించడంతో గురువారం చనిపోయాడు. కేసు నమోదు చేసిన ఎస్సై నాగార్జునరెడ్డి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

2,613 పాఠశాలల్లో కిట్స్ పంపిణీ



కిట్ అందజేస్తున్న ఏపీసీ వెంకటసుబ్బయ్య

నెల్లూరు(టౌన్): విద్యార్థి మిత్ర పథకంలో భాగంగా జిల్లాలోని 2,613 ప్రభుత్వ పాఠశాలల్లో స్టూడెంట్ కిట్స్‌ను పంపిణీ చేసినట్లు సమగ్రశిక్ష ఏపీసీ వెంకటసుబ్బయ్య తెలిపారు. నెల్లూరు దర్గామిట్టలో ఉన్న జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం ఏపీసీ చేతుల మీదుగా కిట్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలివిడతలో ప్రతి విద్యార్థికి పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, డిక్షనరీ, పిక్టోరియల్ డిక్షనరీలు అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఎంఓ సుధీర్‌బాబు, సీఎంఓ పెంచలయ్య, ఏపీఓ ప్రసాద్, ఎంఈఓ మురళీధర్, స్కూల్ హెచ్‌ఎం కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాకాణి బెయిల్ పిటిషన్‌పై విచారణ నేడు

నెల్లూరు(లీగల్): మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి దాఖలు చేసిన బెయిల్ పిటిషన్ గురువారం విచారణకు వచ్చింది. రేపటి నుంచి రెగ్యులర్ ఐదో అదనపు జిల్లా (ప్రత్యేక ఎస్సీ, ఎస్టీ,) న్యాయమూర్తి సరస్వతి కోర్టుకు హాజరు అవుతున్నందున ఇన్‌చార్జి కోర్టు న్యాయమూర్తి సుమ కేసు విచారణను శుక్రవారానికి వాయిదా వేశారు.

14, 15 తేదీల్లో జాతీయ పన్ను సదస్సు



పోస్టర్లను ప్రదర్శిస్తున్న సభ్యులు

నెల్లూరు(టౌన్): నేషనల్ ట్యాక్స్ కాన్ఫరెన్స్, ఆలిండియా ఫెడరేషన్ ఆఫ్ ట్యాక్స్ ప్రాక్టీషనర్స్ ఆధ్వర్యంలో ఈనెల 14, 15 తేదీల్లో నెల్లూరులోని డీఆర్ ఉత్తమ్ హోటల్లో జాతీయ పన్ను సదస్సు నిర్వహించనున్నట్లు జిల్లా సేల్స్ ట్యాక్స్ బార్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. గురువారం నెల్లూరు కేవీఆర్ పెట్రోల్ బంక్ సమీపంలోని సేల్స్ ట్యాక్స్ బార్ అసోసియేషన్ కార్యాలయంలో సదస్సుకు సంబంధించి వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సదస్సుకు సంస్థ జాతీయాధ్యక్షుడు సమీర్ జానీ, హైకోర్టు న్యాయమూర్తి ఎన్.జయసూర్య, స్టేట్ జీఎస్టీ కమిషనర్ రవిశంకర్, అదనపు కమిషనర్ జేవీఎం శర్మ తదితరులు హాజరవుతారన్నారు. జిల్లాలోని వ్యాపార, వాణిజ్య వర్గాలు, ఆడిటర్లు, కన్సల్టెంట్లు, ట్యాక్స్ అడ్వకేట్లు తదితరులు రిజిస్టర్ చేసుకుని సదస్సులో పాల్గొనాలన్నారు. సీనియర్ సీఏ పప్పు మధుసూదన్, సీనియర్ ట్యాక్స్ అడ్వకేట్ పాండురంగయ్య, సీనియర్ ఆడిటర్ కోట సూర్యప్రకాశంను సత్కరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు ఎం.సుబ్బారావు, కోటసునీల్‌కుమార్, వెంకటేశ్వరరావు, ఏవీఎస్ కృష్ణమోహన్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

టిప్పర్ ఢీకొని వ్యక్తి దుర్మరణం



వెంకటరమణయ్య మృతదేహం

వెంకటాచలం: టిప్పర్ ఢీకొని వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని తాటిపర్తిపాళెం సమీపంలో గురువారం సాయంత్రం జరిగింది. గ్రామస్తులు, పోలీసుల కథనం మేరకు.. తాటిపర్తిపాళెం గ్రామానికి చెందిన గుమ్మా వెంకటరమణయ్య (48) బైక్‌పై వస్తుండగా.. తాటిపర్తిపాళెం సమీపంలో గోశాల నుంచి వస్తున్న టిప్పర్ వేగంగా బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న వెంకటరమణయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఘటనా స్థలానికి చేరుకుని పోలీసులకు సమాచారం అందించారు. వెంకటరమణయ్యకు భార్య సుభాషిణి, ముగ్గురు పిల్లలున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	:రూ.32
సన్నవి	:రూ.20
పండ్లు	:రూ.10




నెల్లూరు రైల్వేస్టేషన్‌లో వ్యక్తి మృతి



నెల్లూరు(క్రైమ్): అనారోగ్యంతో గుర్తుతెలియని వ్యక్తి నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారం నంబర్ 4పై గురువారం తెల్లవారుజామున మృతిచెందారు. మృతుడు సుమారు 35 నుంచి 40 ఏళ్లలోపు వయసు కలిగి నలుపు రంగు హాఫ్ హ్యాండ్స్ టీషర్టు, బ్లూ కలర్ జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. దీనిపై సమాచారం అందుకున్న నెల్లూరు రైల్వే ఎస్సై ఎన్.హరిచందన ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు. మృతుని వివరాలు తెలిసిన వారు నెల్లూరు రైల్వే పోలీసులకు తెలియజేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

డీసీఏఓగా తిరుపాల్‌రెడ్డి



గుర్రప్పను కలిసిన తిరుపాల్‌రెడ్డి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లా సహకార ఆడిట్ అధికారిగా కె.తిరుపాల్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన గురువారం స్థానిక కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు డీసీఏఓగా విధులు నిర్వహిస్తున్న తిరుపతయ్య నరసరావుపేటకు బదిలీ కావడంతో కావలి డివిజనల్ సహకార అధికారిగా పని చేస్తున్న తిరుపాల్‌రెడ్డిని నియమించారు. దీంతో ఆయన డీసీఓ గుర్రప్పను మర్యాదపూర్వకంగా కలిశారు.

కండలేరులో 37.688 టీఎంసీలు



రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం నాటికి 37.688 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు ఇన్‌చార్జి ఈఈ రామచంద్రమూర్తి తెలిపారు. సత్యసాయి గంగ కాలువకు 2,380, పిన్నేరు కాలువకు 10, లోలెవల్ కాలువకు 60, హైలెవల్ కాలువకు 50, మొదటి బ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

